చివరి ఆయకట్టుకు నీరందేనా?


ఎండుతున్న మొక్కజొన్న పంట

- ఎండుతున్న పంటలు
- 8 వేల ఎకరాల మొక్కజొన్న ప్రశ్నార్థకం
- వరుణుడి కోసం రైతన్న ఎదురుచూపులు


వర్షం కోసం పెద్దమారు గ్రామంలో పూజలు చేస్తున్న రైతులు (ఫైల్)

చిన్నంబావి: చెంతనే కృష్ణానది ఉన్న సాగునీరు అందక పంటలు ఎండిపోతున్న పరిస్థితి చిన్నంబావి మండల రైతులది.. ఈ ఏడాది వర్షాలు ముందుగానే రావడంతో ఖరీఫ్ కాలం కూడా ఒక నెల ముందే ప్రారంభకావడంతో రైతులు సాగు చేశారు. ఈ ఏడాది బాగా వానలు పడతాయి అనుకుంటే మేఘాలు కనిపిస్తున్నాయి గాని వానలు పడతలేవు. తుంపర్లు తప్ప భూమి తడిసేది లేదు. చెరువులు నిండే జాడ లేదని రైతులు అందోళన చెందుతున్నారు. దీనికి తోడు జూరాల చివరి ఆయకట్టు ప్రాంతం కావడంతో గోపాల్‌దిన్నే రిజర్వాయర్ నుంచి అందే నీరు సైతం చివరికి రావడం లేదు. దీంతో వెల్టురు, చిన్నమారు, అయ్యవారిపల్లి, కాలురు, చెల్లపాడు, కొప్పునూరు, పెద్దమారు గ్రామాల రైతుల బాధలు అన్ని ఇన్ని కావు.. మండలంలో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మొక్కజొన్న పంటను అధికంగా దాదాపుగా 8వేల ఎకరాల్లో సాగు చేశారు. దీంతో మక్క పంటసాగు ప్రశ్నార్థకంగా మారింది..

పెరగని భూగర్భ జలాలు..

మండలంలో అడపాదడపా వర్షాలు పడడంతో ఎక్కడ చెరువు, కుంటల్లోకి నీరు రాలేదు. దీంతో మండలంలోని ఏ గ్రామంలో కూడా రైతుల వ్యవసాయ బావుల్లో భూగర్భజలాలు పెరగకపోవడంతో మొక్కజొన్న సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు రావడంతో ఎంతో ఆశతో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. తీరా మొక్కజొన్న విత్తుకున్న తర్వాత వానలు ముఖం చాటేయడంతో వరుణుడి కరుణ కోసం ఆకాశం వైపు రైతులు ఎదురు చూస్తున్నారు.

నీరు విడుదల చేయాలి..

గోపాల్‌దిన్నే రిజర్వాయర్ నుంచి చిన్నంబావి మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు అందుతుంది. వారబందిగా 15 రోజులకు ఓ మారు వారానికి నాలుగు రోజులు సాగు నీరందేది. కానీ చివరి ఆయకట్టు ప్రాంతం కావడం వర్షాలకు ఆధారపడి అధిక మొత్తంలో దాదాపుగా 8 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగును, అదే విధంగా మరో 3వేల ఎకరాల్లో వరి ఇతర పంటలను సాగు చేశారు. వర్షాలు లేకపోవడంతో పంటలన్నీ ఎండిపోతుండటంతో వారానికి 5 రోజులు నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

వరుణుడి కోసం పూజలు:

వరుణుడి రాక కోసం మండలంలోని పెద్దమారు, చిన్నమారు గ్రామాల్లో రైతులు కృష్ణానది నుంచి నీటిని తెచ్చి శివాలయంలో పూజలను రైతులు పెద్ద ఎత్తున చేస్తున్నారు. వర్షాలు రాకపోతే రైతులు భారీ నష్ట పోవడమే గాక అప్పులపాలు కావాల్సి వస్తుందని పలువురు రైతులు వాపోతున్నారు.

> **సాగునీరు విడుదల చేయండి**
>
> 
>
> డీ–36 కెనాల్ కింద ఆధారపడి నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశాను. ఈ ఏడాది ముందస్తు వర్షాలతో మొక్కజొన్నను సాగు చేశాను. కానీ వర్షాలు లేకపోవడంతో పంట ఎండిపోతుంది. గోపాల్‌దిన్నే రిజర్వాయర్ నుంచి వెంటనే సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలి
>
> –శివయ్య, రైతు పెద్దదగడ గ్రామం

> **పంటలు ఎండుతున్నాయి**
>
> 
>
> ఈ ఏడాది ముందస్తు వర్షాలకు మొక్కజొన్న, వరి పంటలను సాగు చేశాం. కానీ అనుకున్న స్థాయిలో వరుణడి కరుణించకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. అదేవిధంగా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి చివరి ఆయకట్టుకు సాగు నీటిని విడుదల చేయాలి.
>
> –రమేశ్, పెద్దదగడ గ్రామం

నవజాత శిశువులకు తల్లిపాలే మేలు


జిల్లాస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: నవజాత శిశువులకు తల్లి పాల ద్వారానే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, మొదటి ఆరునెలలు తప్పనిసరిగా తల్లిపాలే ఇవ్వాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ వరకు తల్లిపాల వారోత్సవాల నేపథ్యంలో గురువారం ఎంసీహెచ్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నవజాత శిశువులకు తల్లిపాల ద్వారానే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, మొదటి ఆరు నెలలు తప్పనిసరిగా తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలతో పిల్లలకి ఎన్నో రకాల పోషకాలు అందుతాయన్నారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను వివరించిన వైద్యులకు కలెక్టర్ అభినందించారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన వైద్య విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై వైద్య విద్యార్థులు చేపట్టిన నాటక కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది.

పలు వార్డులను తనిఖీ చేసిన కలెక్టర్..

ఎంసీహెచ్ సందర్భంగా భాగంగా కలెక్టర్ ఆసుపత్రిలో పలు వార్డులను తనిఖీ చేసి వైద్యుల అటెండెన్స్ తనిఖీ చేశారు. ఎదుగుదల సరిగా లేని బిడ్డలను మెరుగుపరిచే ఎన్ఆర్‌సీ విభాగాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ అడ్మిషన్స్, ఓపీ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఎన్ఆర్‌సీ విభాగం వినియోగాన్ని ఇంప్రూవ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రిలో రోగులను కింద కూర్చోకుండా అదనపు బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌వో శ్రీనివాసులు, సంక్షేమ అధికారి సుధారాణి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, జీజీహెచ్ సూపరిండెంట్, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, రాంచందర్ తదితరులు ఉన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి..

జిల్లాలో రైతులకు కావాల్సిన ఎరువులకు సంబంధించి కొరత లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో రాజారామ్ ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. దుకాణంలో ఎరువుల నిల్వకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని ఎరువుల దుకాణాల బయట నిలువ, ధరల సూచిక బోర్డు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఎరువుల దుకాణం ఎదుట ఎరువుల నిల్వ, ధరల సూచికబోర్డు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులుగౌడ్ ను సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులుగౌడ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థినిని అభినందించిన కలెక్టర్

కొత్తకోట రూరల్: మండల కేంద్రంలో ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని పల్లెపాగ సౌమ్య ప్రతిభాపటిమతో అందరి ప్రశంసలు పొందుతోంది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికుల ప్రాముఖ్యతపై సౌమ్య ప్రసంగం ఎంతోమందిని ఆకట్టుకుంది. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో చేనేతపై చక్కగా ప్రసంగించారు. దీంతో గురువారం కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రత్యేకంగా పిలిచి ఆమెకు ఉత్తమ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు, అధికారులు హాజరై విద్యార్థినిని అభినందించారు.

క్లుప్తంగా

నులిపురుగుల నివారణ దినోత్సవంపై అవగాహన

పాన్‌గల్: ఈ నెల 11న నిర్వహించే నులిపురుగుల దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఉపాధ్యాయులకు, ఆశ కార్యకర్తలకు సూచనలు తెలిపారు. 1 నుంచి 19 ఏళ్ల పిల్లలందరికీ 11వ తేదీన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద నులిపురుగుల నివారణ మాత్రలు మింగించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ గోవింద్‌రావు, సూపర్‌వైజర్ శాంతమ్మ, వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలి

పాన్‌గల్: ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకుంటే బిల్లులు అందుతాయని మాజీ జెడ్పీటీసీ, మండల కాంగ్రెస్ నాయకులు రవికుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బహదూర్‌గూడెంలో ఇళ్ల మంజూరు పత్రాలను అందజేసి, నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వైష్ణవి, పంచాయితీ కార్యదర్శి సాజితాబేగం, కాంగ్రెస్ నాయకులు బ్రహ్మయ్య, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రొసీడింగ్‌ల అందజేత



వీపనగండ్ల: మండలకేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గురువారం అధికారులు, కాంగ్రెస్ నాయకులు ప్రొసిడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఇళ్లు లేని వారికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో 50 మందికి ఇళ్లు మంజూరు అయ్యాయని వాటిలో 42 మందికి ప్రొసిడింగ్ పత్రాలను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రాజు, కార్యదర్శి రమేశ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మాజీసర్పంచ్ గంగిరెడ్డి పాల్గొన్నారు.

విధిగా బస్సులు నడపాలి

వనపర్తి విద్యావిభాగం: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల సౌకర్యార్థం బస్సుసౌకర్యం కల్పించాలని గురువారం అఖిల పక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో డీఎంకు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో పలు ప్రభుత్వ కాలేజీ, పాఠశాలలకు హాస్టళ్లు దూరంగా ఉండడంతో, నడవలేక ఆలస్యంగా వెళ్లి ప్రతిరోజూ ఉపాధ్యాయులచే చీవాట్లు పడుతున్నారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని సకాలంలో స్కూళ్లకు, కాలేజీలకు బస్సులు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వెంకటేశ్వర్లు, శంకర్, యాదయ్య తదితరులు ఉన్నారు.

యూనిఫాంల అందజేత

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం హెచ్ఎం పద్మ స్కూల్‌డ్రస్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు రెండోవిడతకు మంజూరైన 106 మంది స్కూల్‌డ్రస్సులు అందజేసినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మలిపెద్ది చంద్రశేఖర్‌కు ఘన నివాళి

వనపర్తిటౌన్: మాల మహానాడు రాష్ట్ర నాయకుడు మలిపెద్ది చంద్రశేఖర్ వర్ధంతిని గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భోజరాజు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

వనపర్తి రూరల్: సీఐటీయూ జిల్లా కార్యదర్శి మండ్ల రాజు ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో హమాలి, ఆశ వర్కర్స్ దగ్గర నిధిని సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. అమెరికన్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా క్యూబాకు ప్రపంచం మొత్తం బాసటగా నిలిచిందన్నారు. ఆగస్టు 10వరకు సంఘీబావ కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సునిత, రాములు పాల్గొన్నారు.

శుభ్రతను పాటిద్దాం

ఆత్మకూర్: పట్టణ ప్రజలు పరిశుభ్రతను పాటించి ఆరోగ్యంగా జీవించాలని మున్సిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌ఎడుకేటర్ సురేందర్‌గౌడ్ మున్సిపల్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం


హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న లక్ష్మికాంత్‌రెడ్డి

అమరచింత: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మికాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని కిష్టంపల్లి గ్రామంలో బీజేపీ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను గురువారం ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామన్న హామీ ఏమైందన్నారు. అనంతరం మండలకేంద్రంలో హిందూస్మశాన వాటికలో రూ.2లక్షలతో హైమాస్ట్‌లైట్లను ప్రారంభించారు. చేనేత ఉత్పత్తుల సంఘం, నాబార్డ్ ఆధ్వర్యంలో చేనేత దినోత్సవంలో పాల్గొని కార్మికులకు సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు మంగలావణ్య, నారాయణ పాల్గొన్నారు.

ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: అభివృద్ధి కార్యక్రమాలకు సొంత నిధులను సమకూర్చుతూ బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు బంగ్ల లక్ష్మికాంత్‌రెడ్డి ఔదార్యాన్ని చాటుకుంటున్నారు. ఇందిరానగర్‌లో తన రైతుబంధు ద్వారా రూ.3.33 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తున్నానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌భూపాల్, బీజేవైఎం రాష్ట్ర సభ్యుడు మనోహర్‌గౌడ్, నాయకులు అంజనేయులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ మోసాల నివారణపై గురువారం అవగాహన కల్పించారు. ఆర్‌బీఐ సహకారంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఎన్జీఓ సౌజన్యంతో నిర్వహించిన అవగాహన సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ తిరుమల్‌రావు, ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ నాగేష్‌కుమార్ మాట్లాడారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా, ఆధార్ వివరాలను ఇతరులకు చెప్పకూడదన్నారు. విద్యార్థులు సైబర్ మోసాల నివారణపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ గోవింద్‌రావు, హెచ్‌సీ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి నరేశ్‌గౌడ్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జీవేశ్వరస్వామి జయంతి

ఆత్మకూర్: సాకుల సాలి కులస్తుల ఆరాధ్య దైవం జీవేశ్వరస్వామి జయంతిని గురువారం పట్టణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక నేతాజీనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో జీవేశ్వరస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేకా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు విఠల్‌రావు, నాందేవ్‌ఖిల్లాల్, విష్ణురాం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వైద్యశిబిరం

వనపర్తి రూరల్: డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు పెబ్బేరు పట్టణ కేంద్రంలోని పీహెచ్‌సీలో గురువారం కంటి వైద్యశిబిరం నిర్వహించినట్లు మండల వైద్యాధికారి ప్రవళిక తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఆప్తమాలిక్ అధికారి రఘునందన్ 48 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. వీరిలో 26మందికి కంటి పొరలు ఉన్నట్లు గుర్తించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ లీలమ్మ, స్వరూపరాణి, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, రాజేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణం

అమరచింత: పట్టణంలో ఆంజనేయస్వామి ఆలయ పునఃనిర్మాణ పూజలు గురువారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. మూలవిరాట్ విగ్రహాన్ని సందర్శించి భక్తులు పూజలు చేశారు. గురువారం వేలాదిమంది భక్తులు అధికసంఖ్యలో తరలొచ్చి స్వామివారికి పూజలు చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లలక్ష్మికాంత్‌రెడ్డితో పాటు పలువురు హాజరై స్వామివారికి పూజలు చేశారు. కార్యక్రమంలో రమేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, అచ్యుతారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

వనపర్తి రూరల్: కొత్త రేషన్‌కార్డుల లబ్ధిదారులకు బియ్యం పంపిణీతో పాటు ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్, సీపీఐ పట్టణ కార్యదర్శి రమేశ్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. మూడునెలల సన్నబియ్యాన్ని జూన్30 వరకు పంపిణీ చేశారని, కొత్తరేషన్ కార్డులు ఉన్న వారికి పంపిణీ చేయలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కళావతమ్మ, సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం

అమరచింత: పుట్టిన బిడ్డకు తల్లిపాలను అందించడంతో ఆరోగ్యంగా ఎదుగుతారని పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఫయాజ్, మానస అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నర్మద, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలో గురువారం మొదటి అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యకమ్రంలో ఎంపీడీఓ ప్రసన్నకుమారి అన్నప్రాసనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, కేవీకే శాస్త్రవేత్త అనిత, అంగన్‌వాడీ టీచర్లు శారదాదేవి తదితరులు పాల్గొన్నారు.

చెట్లు నరికిన వారిపై కేసులు నమోదు

పాన్‌గల్: అటవీ భూముల్లో చెట్లునరికి ధ్వంసం చేసిన సంఘటనపై గురువారం 12 మందిపై కేసునమోదైన ఘటన చోటుచేసుకున్నది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కిష్టాపూర్ శివారులోని కంపార్ట్ నెం.513లోని అటవీ భూముల్లోని 200 నీలగిరి చెట్లు, మిశ్రమ జాతిమొక్కలను కిష్టాపూర్ తండాకు చెందిన 12 మంది రైతులు ఈనెల 5వ తేదీన నరికి వాటికి నిప్పుపెట్టి ధ్వంసం చేసి 7ఎకరాలకు పైగా భూ మిని ఆక్రమించే ప్రయత్నం చేశారన్నారు. 15 టన్నులచెట్ల విలువ రూ.33,242 విలువ ఉంటుందన్నారు. భూములను ఆక్రమించే ప్రయత్నం చేసిన జూల, మారోని, బొజ్జమ్మ, లక్కి, దేవమర్, ఊని, బొజ్యానాయక్, రమేష్, హన్మంతు, చినబోజ్యా, లాలుపై డీఎఫ్‌వో బాలకిష్టమ్మ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పిడుగుపడి గడ్డివాము దగ్ధం

వనపర్తి రూరల్: పిడుగుపడి గడ్డివాము దగ్ధమైన ఘటన పెబ్బేరు పట్టణంలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. పెబ్బేరులో సంతబజారులో గురువారం సాయంత్రం పడిన పిడుగుకు గడ్డివాముపై పిడుగు పడటంతో ఒకేసారి మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు ఫైర్‌స్టేషన్ సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి వచ్చి మంటలు ఆర్పివేశారన్నారు.

విద్యుదాఘాతంతో కోడెదూడ మృత్యువాత

పాన్‌గల్: విద్యుదాఘాతంతో కోడే దూడ మృత్యువాత పడిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. శాగాపూర్ గ్రామానికి చెందిన తెల్గు మైబూషికి చెందిన కోడె దూడ పొలంలో మేత మేస్తూ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్‌తగిలి మృత్యువాత పడిందన్నారు. వీటి రూ.80వేలు ఉంటుందని రైతు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా గ్రంథాలయసంస్థ మాజీడైరెక్టర్ బాలరాజు యాదవ్, నాగేంద్రం, బాలరాజును పరామర్శించి పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు.

పేకాట రాయళ్ల అరెస్టు

వనపర్తి రూరల్: పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు పట్టుకున్న ఘటన గురువారం రాజనగరం గ్రామ శివారులో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ... రాజనగరం శివారులో నలుగురు వ్యక్తులు అందర్ బార్ పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం రావడంతో దాడి చేశారు. నలుగురు వ్యక్తులు ఆడుతుండగా ముగ్గురు వ్యక్తులను పట్టుకొగా, ఓ వ్యక్తి పారిపోయాడు. వారినుంచి రూ.3,100 నగదు, 3బైకులను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువా.. పాఠశాల మైదానమా



పాన్‌గల్: మండల కేంద్రంలోని బా లికల ఉన్నత పాఠశాల మైదానం గురువారం కురిసిన వర్షంతో చెరువును తలపిస్తోంది. పాఠశాల ఆవరణ లో తట్టుగా ఉండటం నీరు బయటకు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో విద్యార్థులు దీంతో నీటిలో నుంచే విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీరు బయటకు వెళ్లేందుకు మొరం వేసి ఇబ్బందులు తొలగించాలని ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు కోరుతున్నారు.

వర్షం రాకతో రైతులకు ఊరట..

మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గురువారం కురిసిన వర్షంతో రైతులకు కొంతవరకు ఊరటనిచ్చింది. 15 రోజులుగా వర్షాలు కురవకపోవడంతో మెట్ట పంటలు ఎండుమొఖం పట్టడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. దీంతో గురువారం వర్షంతో మెట్ట పంటలకు జీవం పోసినట్లు అయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



ప్రతిజ్ఞ చేస్తున్న ఎక్సైజ్ ఎస్ఐ గోవర్ధన్

వీపనగండ్ల: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావొద్దని ఎక్సైజ్ ఎస్సై గోవర్ధన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుకు మత్తుపదార్థాల వలన కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యకమ్రంలో ప్రిన్సిపాల్ శివగౌడ్, డ్రగ్స్ అవేర్నెస్ కన్వీనర్ కల్పన, అధ్యాపకులు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పరుగుపందెంలో సత్తాచాటిన విద్యార్థి


సాత్విక్‌ను అభినందిస్తున్న నాయకులు

ఖిల్లాఘనపురం: జనగామ జిల్లాలో గురువారం జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని అప్పారెడ్డిపల్లికి చెందిన విద్యార్థి సత్తాచాటాడు. సాత్విక్ 60 మీటర్ల పరుగుపందెం పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచినట్లు విద్యార్థి తండ్రి పర్వతాలు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినిని గ్రామస్తులు, మాజీ సర్పంచ్ కృష్ణవేణి, తల్లిదండ్రులు అభినందించారు.

పాఠశాలల్లో ముందస్తు రక్షాబంధన్


మిరాస్‌పల్లిలో విద్యార్థులకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు

కొత్తకోట రూరల్: మండలంలోని మిరాశిపల్లి గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం రక్షాబంధన్ వేడుకలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు పురుష ఉపాధ్యాయులకు రాఖీలు కట్టారు. అనంతరం పాఠశాలలోని బాలికలు బాలురకు రాఖీలు కట్టి, వారిలో సోదరభావాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, భీంపల్లి బాలరాజు, ఉపాధ్యాయులు సత్యనారాయణ ఉన్నారు.

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల ప్రాథమిక పాఠశాలల్లో రాఖీ పండుగను పురస్కరించుకొని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు, విద్యార్థినులు, విద్యార్థులకు రాఖీలు కట్టారు. హెచ్ఎం శ్రీనివాసులు రక్షాబంధన్ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం లక్ష్మయ్య, ముంతరమేశ్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో గురువారం హెచ్ఎం గణేష్‌కుమార్ అధ్యక్షతన రక్షాబంధన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల చేత ఉపాధ్యాయులకు, విద్యార్థులకు రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో గిరిరాజాచారి పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలకేంద్రంలోని భవితకేంద్రంలో గురువారం ఎంఈఓ జయశంకర్ రాఖీ పండుగను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులైన విద్యార్థులతో వారు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ రజిత, ఎమ్మార్సీ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యాలయంలో..

వనపర్తి టౌన్: రాష్ట్ర మహిళామోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఆదేశాల మేరకు గురువారం జిల్లా మహిళామోర్చా అధ్యక్షురాలు అశ్విని రాధ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో రాఖీ వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉప కోశాధికారి జ్యోతి రమణ, మాజీ కౌన్సిలర్ అలివేలమ్మ, మాజీ మహిళా మోర్చా అధ్యక్షురాలు కల్పన పలువురు నాయకులు పాల్గొన్నారు.


వనపర్తిలో టీచర్లకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు


ఖిల్లాఘనపురంలో ఎంఈఓకు రాఖీలు కడుతున్న చిన్నారులు


వనపర్తి బీజేపీలో కార్యాలయంలో ...